డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ, గణేష్‌నగర్ కాలనీలో నివసించే శాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రవి, సీహెచ్. భాస్కర్, గుడ్ల శ్రీనివాస్, రవి, మహేష్, బషీర్, సుధాకర్, వెంకట్, చంద్రయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి తిరు కల్యాణ మహోత్సవం



కల్యాణంలో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి: పునర్వసు నక్షత్రం సందర్భంగా కూకట్‌పల్లిలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం తిరు కల్యాణ మహోత్సవం జరిగింది. టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అంజయ్య బండి రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాధవరం శ్రీనివాసరావు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ హరిచందర్

బాలానగర్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని ఎంఈఓ హరిచందర్ అన్నారు. బాలానగర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. మండల స్థాయిలో 14 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ప్రైవేట్ ఉపాధ్యాయులను కూడా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్ హెడ్ మాస్టర్లు అరుణ జ్యోతి, బాబురావు, అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని జన్మదినం సందర్భంగా అన్నదానం



హస్మత్‌పేట చౌరస్తాలో అన్నదానం చేస్తున్న నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా బీజేపీ నాయకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట చౌరస్తాలో బీజేపీ జిల్లా నాయకులు సత్యమూర్తి, మక్కాల నర్సింగ్‌రావు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

ఇంటికి చేరిన తప్పిపోయిన వ్యక్తి

మూసాపేట: వికారాబాద్ నుంచి మూసాపేటకు జనతానగర్‌కు గణేష్ ఉత్సవాల్లో బ్యాండ్ కొట్టేందుకు వచ్చి తప్పిపోయిన లింగయ్యను కూకట్‌పల్లి పోలీసులు కుటుంబ సభ్యులకు బుధవారం అప్పగించారు. ఈనెల 7న గణేష్ ఉత్సవాలు ముగిసిన అనంతరం ఊరికి వెళతానని చెప్పి బయలుదేరిన లింగయ్య మతిమరుపుతో సనత్‌నగర్‌లో రైలు ఎక్కి సికింద్రాబాద్‌లో దిగాడు. అక్కడ వికారాబాద్ ట్రైన్ అనుకొని గుంటూరు వెళ్లే ట్రైన్ ఎక్కి గుంటూరులో దిగాడు. అక్కడే ఒకరోజు ఉంచి మరుసటి రోజు స్థానికులను అడిగి వికారాబాద్ రైలు ఎక్కాడు. అనంతరం వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగాడు. అక్కడ ఊరులోని యువకులను గుర్తు పట్టి జరిగిన విషయం చెప్పడంతో వారు లింగయ్యను తన ఇంటికి తీసుకువెళ్లారు.ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పడకేసిన పారిశుద్ధ్యం !

పారిశుద్ధ్య నిర్వహణలో జీహెచ్‌ఎంసీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు చెత్తా చెదారాలను తొలగించాల్సిన సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా సరిపెడుతున్నారు. దీంతో కుళ్లిపోయిన చెత్తా చెదారాలతో దోమలు, ఈగల వృద్ధికి దారితీస్తున్నాయి. మూసాపేట సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ నామ్‌కే వాస్తేగా కొనసాగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్త కుప్పలను తొలగించాలని ఆయా కాలనీల ప్రజలు వేడుకుంటున్నారు.





కేపీహెచ్‌బీ 7వ ఫేజులో మద్యం షాపు వద్ద ఖాళీ స్థలంలో..

- అసలే వ్యాధుల కాలం
- చెత్తాచెదారాలతో దర్శనమిస్తున్న కాలనీలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కేపీహెచ్‌బీకాలనీ: రోజుల తరబడి చెత్తను తొలగించకపోయినా అడిగేవారే లేరన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు సిబ్బంది. రోజు వారీగా సిబ్బంది పనికి రాకున్నా కేవలం హాజరు కోసమే అన్నట్లుగా వచ్చి వెళ్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. హౌసింగ్ బోర్డు కాలనీలో ఏ చిన్న వీధి మొదలుకొని ప్రధాన రహదారి వరకు అన్ని చోట్ల వ్యాపార, వాణిజ్య సముదాయాలు నడుస్తున్నాయి. దీనికి తోడు వందల కొద్దీ హాస్టళ్ల నిర్వహణ కూడా ఉండటంతో డబ్బుకు కొదవలేకుండా పోయింది. దీంతో ఆదాయ వనరులు ఉన్న ప్రాంతాల్లోనే పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపడుతున్నారని, అంతర్గత రహదారులు, కాలనీల్లో కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్‌ఎఫ్‌ఏల మేనేజ్‌మెంట్..

పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణలో కీలకపాత్ర పోషించే ఎస్‌ఎఫ్‌ఏల అటు పై స్థాయి అధికారులకు ఇటు కిందిస్థాయి సిబ్బందికి నడుమ సమన్వయం చేసుకుంటూ చేతి వాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. రోజు వారీ విధులకు హాజరయ్యే సిబ్బంది అటెండెన్స్ నమోదుతో మొదలయ్యే వీరి విధులు ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి విధి నిర్వహణపై ఫొటోలతో కూడిన సమాచాన్ని అందిస్తారు. కొన్ని ప్రాంతాల్లో సిబ్బంది హాజరు శాతం మొదలుకొని ఆయా వాణిజ్య వ్యాపార కేంద్రాల నుంచి వసూళ్ల వరకు అన్ని తానై పర్యవేక్షిస్తూ చక్రం తిప్పుతున్నారు. కొంత మంది సిబ్బంది హాజరు వేసుకొని పని చేయడం లేదు. దీంతో అసలు పారిశుద్ధ్య నిర్వహణ గాలికి పోగా వసూళ్లపైనే ధ్యాస పెడుతున్నారు. స్థానికంగా తమ పనితీరుపై ఫిర్యాదులు రాకుండా మేనేజ్ చేస్తూ వ్యవహారాన్ని గుట్టుగా సాగిస్తున్నారన్న చర్చ జరుగుతుంది. గతంలో ఇక్కడ పనిచేసిన కొందరు ఎస్‌ఎఫ్‌ఏలను అవినీతి అక్రమాలపై ఆరోపణలు రావడంతో ఇతర ప్రాంతాలకు బదిలీ చేసిన సంఘటనలు సైతం ఉన్నాయి.

ఫిర్యాదు చేసినా స్పందన కరువు

పారిశుద్ధ్య నిర్వహణలో స్థానిక సిబ్బంది తీరుపై కాలనీ వాసులు అనేక మార్లు ఫిర్యాదు చేసినా సరైన స్పందన లేకపోవడం గమనార్హం. కూకట్‌పల్లిలో హౌసింగ్ బోర్డు కాలనీలో అనేక చోట్ల చెత్తా చెదారాలపై జీహెచ్‌ఎంసీ అధికారులకు నిత్యం ఫిర్యాదులు అందుతున్న సరైన స్పందన కనిపించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. 7వ ఫేజ్‌లోని సంక్షేమ సంఘం ప్రతినిధులు తమ కాలనీలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. అంతంత మాత్రంగానే స్పందిస్తున్నారని పలువురు తెలిపారు. ప్రధానంగా శానిటేషన్ పనుల విషయంలో స్థానిక అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హౌసింగ్ బోర్డు అధికారులు స్పందించాలి

హౌసింగ్ బోర్డుకు చెందిన ఖాళీ స్థలాలు చెత్తా చెదారాలకు నిలయంగా మారుతున్నాయి. 7వ ఫేజ్ చుట్టు పక్కల ఉన్న హౌసింగ్ బోర్డు ఖాళీ స్థలంలో చెత్తా చెదారాలు పారబోస్తున్నారు. అంతే కాకుండా డబ్బాలను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేసే వారు కూడా కనీసం పరిశుభ్రత పాటించకుండా ఇష్టారాజ్యంగా చెత్తను వేస్తున్నారు. వాటిని సిబ్బంది కూడా తొలగించడం లేదు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.

– అంజిబాబు

హౌసింగ్ బోర్డు అధికారుల నిర్లక్ష్యం

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో హౌసింగ్ బోర్డుకు చెందిన ఖాళీ స్థలాలు చెత్తా చెదారాలకు నిలయంగా మారిన స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. 7వ ఫేజ్‌లోని ప్రధాన రహదారికి పక్కనే ఉన్న కమర్షియల్ స్థలాలు, స్థానిక మద్యం షాపు పక్కన ఉన్న స్థలాలను ఓపెన్‌గా వదిలేయటంతో స్థానికంగా డబ్బాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహించే వారు తమ చెత్తా చెదారాలను, వ్యర్థాలను అక్కడే పారబోస్తున్నారు. దీంతో అటు కాలనీ వాసులకు ఇటు రోడ్డుపై ప్రయాణించే వారికి ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌కు వినతి

బాలానగర్: అనుమతి లేకుండా జేఎన్‌టీయూ లోగోను వాడటం, తప్పుడు సర్క్యులర్‌లను విడుదల చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్, ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు రాహుల్, దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ.. రిజిస్ట్రార్ పేరుతో కొన్ని సర్క్యులర్‌లు మీడియాలో చక్కర్లు కొడుతున్నాయని, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయటం ఆందోళన కలిగిస్తుందన్నారు. వాటి వల్ల విద్యార్థులు వాస్తవాలు అనుకొని ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జవ్వాజి దిలీప్, చంద్రశేఖర్, చక్రవర్తి, జయరాం, స్టాలిన్, రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ సర్దార్‌పటేల్‌నగర్‌కు చెందిన బొజ్జిల నారాయణ రెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి బుధవారం నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మూసాపేట: కూకట్‌పల్లి బస్టాప్ వద్ద ఫుట్‌పాత్‌పై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతి చెందిన వ్యక్తిని పరిశీలించారు. ఫుట్‌పాత్‌పై సుమారు 45 నుంచి 50 సంవత్సరాలు ఉన్న ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. పరిసర ప్రాంత వాసులను ప్రశ్నించగా.. కొన్ని రోజులుగా బస్టాప్ దగ్గర ఉంటూ బిక్షాటన చేస్తున్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం గాంధీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సమీక్ష

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కార్పొరేటర్లతో జూబ్లీహిల్స్ ఉప ఉన్నికపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ పాలనతో అభివృద్ధి ఎలా కుంటుపడిందో వివరించాలన్నారు. సమావేశంలో కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, సతీష్ గౌడ్, మహేశ్వరి శ్రీహరి, సబిహా బేగం, శిరీషా బాబురావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ప్రభుత్వ స్థలానికి కంచె వేసిన హైడ్రా

- 2 వేల గజాల స్థలం కబ్జా కాకుండా చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మోతీనగర్: ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలంటూ ఎంసీహెచ్‌ఎస్ పాలక కమిటీ సభ్యులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో భాగంగా బుధవారం హైడ్రా అధికారులు, సిబ్బంది మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని సుమారు 2 వేల గజాల స్థలానికి ఫెన్సింగ్ వేశారు. ఆ సమయంలో కొంతమంది వ్యక్తులు ఆ స్థలం తమదేనంటూ రావటంతో వారి వద్ద ఏమైనా డాక్యుమెంట్స్ ఉంటే హైడ్రా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఫెన్సింగ్ వేశారు. కొన్ని సంవత్సరాలుగా కోట్లాది రూపాయల విలువైన స్థలం ఖాళీగా ఉండటంతో కార్లు పార్కింగ్, చెత్తా చెదారం వేయడంతో ఈ స్థలానికి నాలుగు వైపులా ఉన్న నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు హైడ్రా అధికారులు స్పందించి పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించారు. స్థలం చుట్టూ రాడ్లు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేయటంతో స్థానికులు హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు.



ఫెన్సింగ్ వేసిన అనంతరం పబ్లిక్ నోటీస్ బోర్డును ఏర్పాటు చేసిన హైడ్రా అధికారులు

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



రోడ్డు ఆక్రమణలను తొలగించిన ట్రాఫిక్ పోలీసులు

మూసాపేట: మూసాపేట పరిధిలో కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆంజనేయనగర్ చౌరస్తా నుంచి మూసాపేట చౌరస్తా వరకు, అక్కడి నుంచి వై జంక్షన్ వరకు రోడ్డు ఆక్రమణలను తొలగించారు. 7 వాహనాలు (ఆటోలు, ట్రాలీలు), 21 ద్విచక్ర వాహనాలు, రోడ్లపై ఆక్రమించిన షాపుల బోర్డులు, చిరు వ్యాపారుల బడ్డీలు, టీస్టాల్స్ వంటి వాటిని తొలగించారు. అదే విధంగా 40 మందిపై చలాన్లు విధించి సుమారు 38 వేల రూపాయలను వసూలు చేశారు. ఈ సందర్భంగా సీఐ ముత్తు యాదవ్ మాట్లాడుతూ.. రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు

మోతీనగర్: డివిజన్‌లో వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్, రామారావునగర్‌లలో రూ.20 లక్షల వ్యయంతో వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు పలుచోట్ల కనెక్షన్ చాంబర్స్ ఏర్పాటు పనులను బుధవారం ప్రారంభించారు. ఆయా చోట్ల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో అల్లాపూర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో నాగుల సత్యం, సయ్యద్ రియాజ్, రాంబాబు, అబ్దుల్‌హమీద్, రాజు, నర్సింహ, మీర్జా అస్లాం బేగ్, రాంరెడ్డి, సంజీవ, మల్లేష్, షేక్ రఫీ, నరసింహారెడ్డి, రహీం, అక్రమ్, ముత్యాల దుర్గ తదితరులు పాల్గొన్నారు.



చాంబర్స్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

26లోగా అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ కోసం దరఖాస్తు చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వర్సిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లిలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌ను వర్సిటీ డైరెక్టర్ వై. వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రచార ప్రక్రియలో భాగంగా ప్రచార పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 43 సంవత్సరాలుగా రెగ్యులర్ వర్సిటీలతో సమానంగా డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. బీఏ, బీకాం, బీఎస్‌సీ డిగ్రీ కోర్సులకు అడ్మిషన్ల కోసం సెప్టెంబర్ 26 చివరి తేది అని తెలిపారు. ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్ పొందాలంటే ఇంటర్, ఓపెన్ ఇంటర్ లేదా పాలిటెక్నిక్, రెండు సంవత్సరాల ఐటీఐ ఉత్తీర్ణత తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం స్టడీ సెంటర్‌ను, ఫోన్ నెంబర్ 7382929748లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కరుణాకర్, కో ఆర్డినేటర్ సాయి కొండల్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ సెంటర్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

ఘనంగా విశ్వకర్మ జయంతి



హెచ్‌ఏఎల్‌లో జరిగిన జయంతి వేడుకల్లో వెంకటాద్రి, విజయ్ ప్రసాద్ తదితరులు



చరబండ రాజు కాలనీలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్ రెడ్డి



కేపీహెచ్‌బీ పూజలో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్, వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: శ్రీవిశ్వకర్మ జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నల్లపోచమ్మ తల్లి దేవాలయం ప్రాంగణంలో చెల్లోజు యాదగిరి చారి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్‌రావు, సురభి రమేష్ రావు, విశ్వ కర్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బాలానగర్‌లోని హెచ్‌ఏఎల్‌లోని కమ్యూనిటీ హాలులో జరిగిన వేడుకల్లో విరాట్ విశ్వకర్మ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు దయాకర్, ప్రధాన కార్యదర్శి మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వెంకటాద్రి, గౌరవ అధ్యక్షులు విజయ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు. రమ్యా గ్రౌండ్ వద్దగల వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక హోమాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాండురంగ చారి, శ్యాంసుందర్, ఏఎంసీ చైర్మన్ పుష్పరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బాలానగర్ చరబండరాజు కాలనీలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవంలో ఎమ్మెల్యే కృష్ణారావు కార్పొరేటర్ రవీందర్‌రెడ్డితో కలిసి పూజా కార్యక్రమం నిర్వహించారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి: భవానీనగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో విశ్వకర్మ భగవానుడి యజ్ఞ మహోత్సవం కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ స్వామి వారిని దర్శించుని పూజలు చేశారు. ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తాలో విశ్వకర్మ జెండాను ఎగురవేశారు. అదేవిధంగా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఏర్పాటు చేసిన విశ్వకర్మ జయంతిలో మాధవరం కాంతారావు సీనియర్ నాయకుడు తిరుపతితో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో సయ్యద్ ఏజాజ్, జంగయ్య, శివకుమార్, పండరి, చింతామణి, నరేందర్ పాల్గొన్నారు.

అమరుల త్యాగ ఫలితమే నేటి స్వాతంత్య్రం

- సెప్టెంబర్ 17 సందర్భంగా నేతలు
- నియోజకవర్గ వ్యాప్తంగా జాతీయ జెండాల ఎగరవేత

కూకట్‌పల్లి జోన్‌బృందం : హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనమైన సెప్టెంబర్ 17ను ఆయా రాజకీయ పార్టీలు బుధవారం ఘనంగా నిర్వహించాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవం, బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా జాతీయ జెండాలను ఎగరవేశారు. నిజాం పాలనలో ప్రజల ఇబ్బందులను నేతలు వివరించారు. నిజాం వ్యతిరేక పోరాటంలో అసువులుబాసిన అమరులకు నివాళులర్పించారు. వారి పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.



జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కృష్ణారావు



కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో.. మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు



మూసాపేట చౌరస్తాలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శిరీష తదితరులు



మోతీనగర్ వార్డు కార్యాలయం వద్ద.. కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్, నాయకులు



ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో బీజేపీ కార్యాలయం వద్ద..



కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో .. ప్రిన్సిపాల్ వెంకటయ్య తదితరులు



గాయత్రినగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో